క్లుప్తంగా

మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వానం


మంత్రితో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

నారాయణఖేడ్: మండల కేంద్రమైన కంగ్టిలో ఈ నెల 5వ తేదీన విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరానికి హాజరు కావాలని ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శిబిరాల గూర్చి వివరించారు. విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామని మంత్రికి వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ రాజు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదివాంర ఆలయ నిర్మాణానికి రూ.1.50లక్షల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భరత్‌చారి, విఠల్‌చారి, సంతోష్‌చారి, అంజన్నచారి, కళ్యాణ్‌చారి, అశోక్‌చారి, యాదయ్య చారి పాల్గొన్నారు.

కుమ్మరుల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కుమ్మరుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పాశమైలారం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన కుమ్మరుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉనికి కోల్పోతున్న కులవృత్తులకు జీవం పోసిన మహోన్నత నాయకుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కులవృత్తులను కాపాడేందుకే ప్రభుత్వం ఇటీవల బీసీ బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సర్పంచ్ కృష్ణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజం


సత్యనారాయణను సన్మానిస్తున్న వార్డెన్ శారద

ఝరాసంగం(జహీరాబాద్): ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమేనని బీసీ హాస్టల్ వార్డెన్ శారద అన్నారు. బీసీ హాస్టల్లో విధులు నిర్వహిస్తున్న వంట మనిషి సత్యనారాయణ పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆదివారం ఝరాసంగం బీసీ హాస్టల్‌లో సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం


గో పూజ చేస్తున్న నీలం మధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు అన్నారు. ఆదివారం భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీకాలనీలోని దత్తాత్రేయ సహిత, కార్యసిద్ధి పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.8లక్షలు ఇస్తానని హామీనిచ్చారు. అందులో భాగంగా రూ.3లక్షలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

సర్కార్ బడికి సై


నల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల



ప్రత్యేక బస్సులో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య
- కార్పొరేట్‌కు దీటుగా వసతుల కల్పన
- విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటు
- పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రుల ఉత్సాహం

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. అంతేకాకుండా ప్రైవేటు బడుల్లో మాదిరిగా విద్యార్థుల సౌకర్యార్థం బస్సులను, ఆటోలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతున్నారు. జిన్నారం మండలంలో 27 ప్రభుత్వ ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వీటిలో ×మన ఊరు మనబడి¥ పథకంలో భాగంగా 15 పాఠశాలలు ఎంపికయ్యాయి. ప్రస్తుతం నాలుగు పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పూర్తయ్యాయి. జిన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. దీంతో విద్యార్థులకు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఓ పరిశ్రమ సహకారంతో పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పించారు.

పెరిగిన విద్యార్థుల సంఖ్య

ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తుండటంతో ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో మండల వ్యాప్తంగా సుమారు 1800మందికి పైగా విద్యార్థుల సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలను ×మన ఊరు మన బడి¥ పథకంలో భాగంగా మరింత అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎమ్మెల్యే చొరవ బాగుంది



జిన్నారంలోని ప్రభుత్వ పాఠశాలో వందకుపైగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. దీంతో అదనపు తరగ తి గదులను నిర్మించేవిధంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల సౌకర్యం బస్సు సదుపాయం సైతం కల్పించేవిధంగా ఎమ్మెల్యే చొరవ చూపారు.

– వెంకటేశంగౌడ్, జిన్నారం

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



ప్రభుత్వ బడుల్లో గతంలో కంటే విద్యార్థుల సంఖ్య పెరిగింది. పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తుండటంతో విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు ముందుకు వస్తున్నారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం.

– విజయ, అదనపు జిల్లా విద్యాధికారి

మెనూ పాటించి.. చికెన్ వడ్డించి

- 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు


విద్యార్థికి బగార అన్నం, చికెన్ కరీ వడ్డిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వ వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు ఒక్కొక్క రోజు ఓ రకమైన పౌష్టిక ఆహారం అందించాల్సి ఉంటుంది. అయితే మెనూ ప్రకారం ప్రతి ఆదివారం మధ్యాహ్నం విద్యార్థులకు చికెన్ కరీ, బగార అన్నం వడ్డించాల్సి ఉన్నప్పటికీ మండలంలోని దేవునూర్ ఎస్సీ బాలుర వసతి గృహంలో మెనూ పాటించలేదు. వాటి స్థానంలో అన్నం, పప్పుచారును పిల్లలకు వడ్డించడంతో 'ఆదివారం పప్పు, సాంబారేనా' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలని వార్డెన్ నర్సింహులును ఆదేశించడంతో ఆదివారం విద్యార్థులకు చికెన్ కరీతో కూడిన బగార అన్నం వడ్డించారు. దీంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అసైన్డ్‌మెంట్ భూమిలో నిర్మాణాలు చేపడితే చర్యలు

హత్నూర(సంగారెడ్డి): అసైన్డ్‌మెంట్ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని తహసీల్దార్ పద్మావతి హెచ్చరించారు. మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామ శివారులోని నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్‌మెంట్ భూముల్లో నిర్మిస్తున్న ప్రహరీ పనులను ఆదివారం తహసీల్దార్ సిబ్బందితో కలిసి నిలిపివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండా అసైన్డ్‌మెంట్ భూముల నుంచి అక్రమంగా దారి వేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఉపాధ్యాయులతో 1995-96 బ్యాచ్ విద్యార్థులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇంద్రకరణ్‌లో 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు మధుకర్‌రెడ్డి, రాజమల్లయ్య, వెంకటరమణ, నారాయణరెడ్డి, పూర్వ విద్యార్థులు మహిపాల్, మల్లేష్, శ్రీధర్, శ్రీనివాస్, జనార్దన్, గోపాల్, రమేష్, నర్సింలు, ఉమారాణి, సునీత, శ్యామల, బాలామణి పాల్గొన్నారు.

రూ.20కోట్లతో కల్హేర్ అభివృద్ధి


కల్హేర్: పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): రూ.20 కోట్లు ఖర్చు చేసి కల్హేర్ మండల కేంద్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కల్హేర్‌లో రూ.25లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్హేర్‌లో రూ.5.47 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం, రూ.2కోట్లతో మిషన్ కాకతీయ పనులు, రూ.1.50 కోట్లతో సీసీ రోడ్లు, తదితర పనులు చేపట్టినట్లు వివరించారు. అనంతరం సిర్గాపూర్ మండలంలోని జంలా తండా పంచాయతీలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం పనులను ప్రారంభించారు.ఆత్మ చైర్మన్ రాంసింగ్, ఎంపీపీలు గుర్రపు సుశీలఅంజయ్య, మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీలు నర్సింహారెడ్డి, రాఘవరెడ్డి, కోఆప్షన్ సభ్యులు అలీ, ఘని, వైస్ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్‌లు లచ్చవ్వ, కిష్టారెడ్డి, దివ్యభారతి చరణ్, ఎంపీటీసీ సంగప్ప, పీఏసీఎస్ చైర్మన్ గంగారెడ్డి, నాయకులు నర్సింహగౌడ్, వెంకట్‌రెడ్డి, హన్మంత్‌రావు పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో ఎస్సీ కమ్యునిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీలను కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణించిదన్నారు. కానీ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ హాస్టల్స్, గురుకులాలు, దళితబంధు వంటి పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొంగరి జయశ్రీమోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు పాటిల్, సర్పంచ్ భీమా, డీలర్ మోహన్‌రావు, శ్రీను, నర్సింహులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆందోల్ నియోజకవర్గం చౌటకూరు మండలం చేర్యాల్ గ్రామంలో గత నెల 27న శివంపేట్ హైవేలో హౌరాజి గుండప్ప (హోంగార్డు), నిరుడి దశరథ్ రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గాజుల వీరేందర్, మండల రైతు సమన్వయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి ఉన్నారు.

విద్యుత్ లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యుత్‌శాఖ నస్తీపూర్ లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని నస్తీపూర్ సర్పంచ్ గిర్కల ఎల్లయ్య డిమాండ్ చేశారు. లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నస్తీపూర్ లైన్‌మెన్‌గా కొనసాగుతున్న నవీన్ గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా పట్టించుకోవడంలేదని సర్పంచ్ ఆరోపించాడు. ఇటీవల నస్తీపూర్ శ్రీరామనగర్ కాలనీలో వీధి దీపాల కోసం వేసిన విద్యుత్ వైర్లను గుట్టుచప్పుడు కాకుండా విప్పుకొని పోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అంతేకాకుండా గ్రామంలో ఏదైనా అత్యవసర విద్యుత్ సమస్య తలెత్తినప్పుడు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాకుండా వ్యవసాయ పొలాల వద్ద రైతులకు ఎలాంటి సమాచారం లేకుండానే ఇష్టానుసారంగా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నాడని, దీంతో వరినార్లు ఎండుముఖం పడుతుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. లైన్‌మెన్ నిర్లక్ష్యంపై పలుమార్లు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో పాటు విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్‌ను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లైన్‌మెన్‌ను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహమూద్ అలీ, వార్డుసభ్యులు దశరథ, బాలప్ప, నర్సింహులు కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు


ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

జహీరాబాద్: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని ట్రస్మా నాయకులు అన్నారు. ఆదివారం జహీరాబాద్‌లో ఆదర్శ విద్యాలయం ప్రధానోపాధ్యాయుడు అయ్యప్పరెడ్డి పదవీ విరమణ సందర్భంగా సమావేశం నిర్వహించారు. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరథరెడ్డి, పాఠశాల అధ్యక్షుడు బెజుగం రాజేశ్వర్, ఎంఈఓ బస్వరాజ్‌లు మాట్లాడుతూ పాఠశాలలో నాలుగు దశాబ్దాలుగా అయ్యప్పరెడ్డి తన సేవలందించి ఎంతోమందిని తీర్చిదిదద్దారని తెలిపారు. వారి సేవలను జహీరాబాద్ ప్రాంత ప్రజలు ఎన్నటికీ మర్చిపోరన్నారు. కార్యక్రమంలో పలు రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు క్రిష్టారెడ్డి, ముజాయిద్, నాగన్న పాల్గొన్నారు.

భక్తిధాం తండాలో మహా మృత్యుంజయ హోమం


హోమం చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండాలో ప్రఖ్యాత విశ్వపాళిని(జ్వాలాముఖి) భవానీ సమేత సేవాలాల్ మహారాజు మహా మందిరంలో ఆదివారం మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిరం ధర్మకర్త మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతులు వరుణ యాగం చేశారు. ఈ కార్యక్రమానికి రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కృష్ణమనేని పాపరావు ముఖ్యఅతిథిగా హజరై పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త మూడ్ కిషన్‌సింగ్, నిజామాబాద్‌కు చెందిన కవి ఘనపూరం దేవేందర్, తండా ప్రముఖులు రూప్‌సింగ్, రాములు, కిషన్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌సింగ్, శంకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి**

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బీజేపీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఆదిత్యవర్ధన్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా మన్నే రజిని, ప్రధాన కార్యదర్శిగా జ్యోతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా శిరీష్ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా టప్ప మోహన్ బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా నరేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ **సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం**

జిన్నారం(పటాన్‌చెరు): ప్రజా సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం జిన్నారంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ తాత్కాలిక విస్తారక్‌లు సంతోషి, ఉదయ్‌కుమార్, నాయకులు సుధాకర్‌గౌడ్, సాయికిరణ్, జగన్‌రెడ్డి, వీరేష్ పాల్గొన్నారు.

◆ **ఆలయ అభివృద్ధికి విరాళం**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆత్మకూర్ నాగేష్ రూ.50వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నాగేష్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీచర్స్ యూనియన్ నాయకుడు చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు మిట్టప్ప, వీర మల్లేశం, ఉప్పరి రాజు, ఈశ్వరప్ప, సంగప్ప, రియాజ్, ఆత్మకూర్ నాగేష్ యువసేన నాయకులు బక్కప్ప, ప్రసాద్‌గౌడ్, నరేష్ పాల్గొన్నారు.

◆ **హనుమాన్ ఆలయంలో యజ్ఞం**

మనూరు(నారాయణఖేడ్): మండల పరిధిలోని మాయికోడ్‌లో హనుమాన్ ఆలయంలో వివేకనంద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డి కుటుంబ సభ్యులు యజ్ఞంలో పాల్గొనగా వారితోపాటు గ్రామస్తులు భీమన్న, సంగమేశ్వర్, అనంతం, శివరాజ్, నాగప్ప, రేవప్ప పాల్గొన్నారు.

◆ **చందాపూర్‌లో వైద్యశిబిరం**

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ గ్రామంలో బక్కన్నగారి రాజు మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమున్న మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు నరసింహారెడ్డి, సౌమ్య, సాయి పాల్గొన్నారు.

◆ **సాయిచంద్‌కు నివాళి**

ఝరాసంగం(జహీరాబాద్): ఇటీవల గుండెపోటుతో మరణించిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్‌కు ఆదివారం ఝరాసంగంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, గ్రామస్తులు నర్సింలు, తుకారం, సంగన్న, వెంకటేష్, శివకుమార్, శంకర్, చంద్రయ్య, నాగరాజు, మచ్చ చందర్, పెంటయ్య, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

◆ **భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని రాచన్నపేటలో ఆదివారం నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భజనలు, కీర్తనలు చేస్తూ భగవంతుడిని స్మరించారు.

◆ **నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం**

సంగారెడ్డి మున్సిపాలిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సంగారెడ్డిలో నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా నాగిరెడ్డి కార్యదర్శిగా కిషన్, కోశాధికారిగా రమేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ క్లబ్ ఆఫ్ సంగారెడ్డి మాజీ గవర్నర్ మూర్తి మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, లింగాగౌడ్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

◆ **కూరగాయల ధరలను తగ్గించాలి**

పటాన్‌చెరు: రాష్ట్ర ప్రభుత్వం సామాన్య ప్రజలపై భారం మోపడం సరికాదని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఆదేశాల మేరకు పెరిగిన కూరగాయల ధరలను తగ్గించాలని కోరుతూ పటాన్‌రు పట్టణంలోని బండ్లగూడ గ్రామంలో మాజీ సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సుధాశ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇష్టానుసారంగా పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

◆ **ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బీహెచ్ఈఎల్ షిరిడి సాయిబాబా దేవాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ పాల్గొన్నారు.

◆ **ఎల్లమ్మ తల్లికి బోనాలు**



రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ఎల్లమ్మ దేవతకు భక్తులు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా బోనాలతో ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సంగారెడ్డి అర్బన్: ఆషాడ మాసం సందర్భంగా సంగారెడ్డి పట్టణం ఎస్ఆర్ఎస్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

◆ **రక్తదాన శిబిరం ఏర్పాటు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఫోటోగ్రాఫర్ భరత్ ముదిరాజ్ జయంతి సందర్భంగా ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ తమ మిత్రుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినప్పటికీ అతని అవయవాలను దానం చేసి చిరంజీవిగా నిలిచాడని తెలిపారు.

◆ **కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

సంగారెడ్డి మున్సిపాలిటీ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ విస్తారక్ భువనేశ్ పూజ అన్నారు. ఆదివారం చౌటకూర్ మండల పరిధిలోని కోర్పోల్, శేరి రామరెడ్డిగూడెం, వెండికోల్, వెంకటకిష్టాపూర్ తదితర గ్రామాల్లో బీజేపీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేష్ పూజ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు రామకృష్ణ, సాగర్, ఉపేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

◆ **వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నర్సింహులు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సదాశివపేట వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీయూడబ్ల్యూజే ఐజేయూ అనుబంధం) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కైరంకొండ నర్సింలు, గౌరవ అధ్యక్షుడిగా హాజీ, ప్రధాన కార్యదర్శిగా దోమకొండ నరేష్, ముఖ్య సలహాదారుడిగా జైరాం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగుల విజయ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దుర్గాప్రసాద్, వెంకట్, ట్రెజరర్‌గా బిట్ల రాజు, సహాయ కార్యదర్శిగా పోల వీరేశం, సంయుక్త కార్యదర్శిగా పోల వెంకటేశం, సభ్యులుగా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.